క్లుప్తంగా

వైభవంగా స్వామివారికి చక్రస్నానం



స్వామికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ: కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్ శ్రీ వరహాలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో శ్రీమదుభయ వేదాన్తాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న 22వ వార్షిక చందన యాత్ర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటలకు స్వామివారికి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు అవసరాల శ్రీకిరణ్ స్వామి పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు ఆరాధన, హోమాలు, నిత్యరూప దర్శనం (చందన రూపసేవ) జరిగాయి. అనంతరం చక్రస్నానం నిర్వహించారు.

గాడాల శ్రీమహాలక్ష్మి పీఠానికి 4 వేల పెన్నుల సమర్పణ



భక్తుల నుంచి పెన్నులను స్వీకరిస్తున్న స్వామీజీ

సీటీఆర్ఐ: విద్యార్థులకు పంపిణీ చేయడానికి ఇప్పటి వరకూ 4 వేల పెన్నులను భక్తులు సమర్పించారని శ్రీ మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి చిన్న వెంకన్న బాబు స్వామీజీ అన్నారు. స్థానిక ప్రకాశం నగర్‌లోని ట్రస్టు కార్యాలయంలో మంగళవారం భక్తుల నుంచి పెన్నులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గాడాలలోని పీఠంలో గురువారం వాగ్దేవీ ప్రత్యేక పూజల అనంతరం పది, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు 4 వేల పెన్నులను ప్రసాదంగా అందజేస్తామన్నారు. అమ్మవారి దగ్గర జరిగే పూజలో ఉంచేందుకు భక్తులు ఈ పెన్నులు సమర్పించారని వివరించారు. సర్దార్ సుమేధ వెంకటరాజు, ముదునూరి కాశేశ్వర వరప్రసాద్ రాజు 2,000, భాష్యం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నక్కా రవికుమార్ 500, గుబ్బల గంగా భవాని 500 పెన్నులను స్వామీజీకి అందజేశారు. గ్రంధి విజయలక్ష్మి 150, అంబటి శ్రీనివాసరావు 200, ఇతర భక్తులు తమ శక్తి కొద్దీ పెన్నులను సమర్పించారు. కార్యక్రమంలో పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెంచాలి

కంబాలచెరువు: విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెరిగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి అన్నారు. స్థానిక వంకాయలవారి వీధిలోని ఓల్డ్ టౌన్ మున్సిపల్‌సి కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కొన్ని పాఠాలు చదివించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు పీవీ లక్ష్మి, ఉపాధ్యాయురాలు శ్రీవల్లి, సీఆర్‌పీ జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హోంమంత్రి కాన్వాయ్ అడ్డగింత

కంబాలచెరువు: హోంమంత్రి తానేటి వనిత కాన్వాయ్‌ను మంగళవారం రాజమహేంద్రవరంలో యూత్ కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. డీఎస్సీలో చాలా తక్కువ పోస్టులు భర్తీ చేస్తున్నారంటూ ఈ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 9 మంది యూత్ కాంగ్రెస్ నాయకులను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం నోటీసులు ఇచ్చి పంపించారు.

సినిమాలు



శ్యామల	: ఊరుపేరు భైరవకోన
సూర్యమినీ	: మేడమ్ వెబ్
సూర్యప్యాలెస్	: ఊరుపేరు భైరవకోన
స్వామి	: ఈగల్
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజీబ్యాండు
అనుశ్రీ	: హనుమాన్
రాజా	: ఊరుపేరు భైరవకోన
ఊర్వశి	: యాత్ర-2
రంభ	: లాల్‌సలామ్
మేనక	: సూర్య సన్‌ఆఫ్ కృష్ణన్,డ్రిల్
అప్సర	: గుంటూరుకారం
కుమారి	: ట్రూలవర్
నామవరం	
వీఎస్ మహల్	: ఊరుపేరు భైరవకోన
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ఊరుపేరు భైరవకోన
కడియం	
వెంకటసూర్య	: ఊరుపేరు భైరవకోన

అమ్మ భాష తెలుగు.. అక్షరమై వెలుగు

- సమాజ వికాసానికి భాషే మూలం
- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



శ్రీనివాసరావుకు తెలుగుతేజం పురస్కారం అందిస్తున్న తెలుగు అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి (ఫైల్)

సీటీఆర్ఐ: మాతృభాష గొప్పదనం మాటల్లో వర్ణించలేనిది. భావ వ్యక్తీకరణకు సులభమైన, సులక్షణమైన మార్గం అమ్మభాష. ప్రతి జాతి సాంస్కృతిక వికాసానికి మూలం మాతృభాషే. ప్రపంచీకరణ నేపథ్యంలో భాషా వికాసం పెరిగింది. మనుగడ కోసం ఇతర భాషలు నేర్చుకోవడంలో తప్పులేదు. కానీ వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా జాగ్రత్తపడాలి. తమ మాతృభాషలను కాపాడుకోవాలని గుర్తు చేసేందుకే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకొంటున్నారు.

నేపథ్యమిదే..

ప్రపంచీకరణ నేపథ్యంలో కొన్ని భాషల ఉనికి ప్రమాదంలో పడటం ఆందోళన కలిగించే అంశం. మాతృభాష కోసం బెంగాల్ యువకుల ఆత్మబలిదానం రగిల్చిన ఉద్యమ స్ఫూర్తితో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవానికి పునాది పడింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రతి ఏటా ఫిబ్రవరి 21న నిర్వహించాలని 1999 నవంబర్ 17న యునెస్కో ప్రకటించింది. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారు.

భాషా ఉద్యమంలో నిరంతర శ్రామికుడు చిలుకూరి

కడియం: గ్రామానికి చెందిన చిలుకూరి శ్రీనివాసరావు వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తెలుగు భాష ఔన్నత్యం చాటడం అతని ప్రవృత్తి. తెలుగు సాహిత్యం, తెలుగు వికాసం కోసం ఆయన రచనలకు గాను 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిడుగు రామ్మూర్తి పురస్కారం అందించింది. ఈయన రాసిన దిష్టిబొమ్మ కవితా సంపుటిని 2013లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. తెలుగు భాష ప్రాధాన్యతను చాటుతూ వివిధ వార, మాస, దిన పత్రికల్లో రాస్తున్న కృషిని ప్రశంసిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాష సేవారత్న పురస్కారాన్ని అందించింది. 2022లో తెలుగు భాష అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీ పార్వతి ఎన్టీఆర్ కళారత్న పురస్కారం అందించారు. 2023 ఉగాది సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి నంది పురస్కారాన్ని ప్రదానం చేశారు.

మమకారం పెరగాలి



నేటి తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలుగు రాదండీ అని గొప్పగా చెప్పుతున్నారు. మాతృ భాషలో మాట్లాడితే సిగ్గు పడే పరిస్థితి వచ్చింది. మన సినిమా, టీవీలు తెలుగు మీద దాడి చేసి పిచ్చి పలుకులు, విపరీత ప్రయోగాలు చేస్తున్నాయి. ఈ కార్యక్రమ నిర్వాహకులు హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ తెలుగు ఖూనీ చేస్తున్నారు. దానినే నేటి తరం అందిపుచ్చుకుంటున్నారు. ఇలాంటివన్నీ మారాలంటే మాతృభాష మీద మమకారం పెరగాలి.

– ఎం.విశాలాక్షి, ఎస్‌కేఆర్ డీఈడ్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు

అత్యంత ప్రాచీనం



అతి పెద్ద, అత్యంత ప్రాచీనమైనది మన తెలుగు జాతి. ప్రపంచ దేశాలకు కూడా మన జాతి, సంస్కృతి, భాష శిరోధార్యం. తెలుగు కోసం ఒక సంస్థను స్థాపించి దాని ద్వారా మన జాతి ఔన్నత్యాన్ని చాటి చెప్పాలని, భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే నా సంకల్పం.

– సన్నాడి వెంకట రమేష్, తెలుగుజాతి జీవన సాహిత్య కళల పరిశోధకులు

మాతృభాషలోనే సాహిత్య కల్పన



మాతృభాషలోనే సాహిత్య కల్పన జరుగుతుంది. ఏ జ్ఞానాన్నైనా ఏ భాషలో నేర్చుకున్నా.. అవగాహన చేసుకోవడం మాత్రం మాతృభాషతోనే సాధ్యమవుతుంది. అందుకని బోధన కూడా మాతృభాషలోనే ఉండాలి. తల్లిభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. నేటి తరం వారు తమ పిల్లలకు మాతృభాష గొప్పతనం తెలియజేయాలి.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగుశాఖాధిపతి

కారం తమ్మన్నదొర జిల్లా ప్రకటించాలి

సీటీఆర్ఐ: బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా 1840లోనే పోరాటం చేసిన రంపచోడవరం మండలం బందపల్లి గ్రామానికి చెందిన తొలి గిరిజన వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కారం తమ్మన్నదొర పేరుతో రంపచోడవరం కేంద్రంగా నూతన జిల్లా ప్రకటించాలని కారం తమ్మన్నదొర జిల్లా సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఆయన అనుచరుల వివరాలను ప్రభుత్వం సేకరించాలని కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ, కారం తమ్మన్నదొర జిల్లా సాధన కమిటీ తెల్లం శేఖర్ మాట్లాడారు. 1840లోనే కారం తమ్మన్నదొర ఆంగ్లేయులపై తిరుగుబాటు లేవదీసి గెరిల్లా పోరాటం ద్వారా రంప వద్ద క్యాంప్ లో వున్న 12 మంది సైనికులను హతమార్చి తెల్లదొరలకు సవాల్ విసిరారని తెలిపారు. ద్వారబంధాల చంద్రయ్య వంటి పోరాటయోధుడు 1879లో కారం తమ్మన్నదొరను కలిసినట్లు చరిత్రలో ఉందన్నారు. తమ్మన్నదొర 1880 వరకు సుదీర్ఘ పోరాటాన్ని కొనసాగించారని ప్రజల విశ్వసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మడకం బంగారుబాబు, పలివెల పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ధవళేశ్వరంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు

ధవళేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరం గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.3.5 కోట్లతో నిర్మించే డ్రైనేజీలకు శంకుస్థాపన చేసిన మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సత్వరం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.2.5 కోట్లతో జలజీవన్ పథకం ద్వారా మంచినీటి పైపులైన్లు వేసి, ఇంటింటికి నీరు అందిస్తామన్నారు. మరో రూ.50 లక్షలతో గోదావరి జలాలను అందించేందుకు అదనంగా మరో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. లక్ష్మీజనార్దన స్వామి కాలనీలో రూ.30 లక్షలతో, ఎర్రకొండ సాయినగర్ కాలనీలో రూ.23 లక్షలతో, బ్యారేజీ కాలనీలో రూ.10 లక్షలతో, బోటాఫీసు వీధిలో రూ.22 లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులకు, అలాగే వాడపేట, కంచర్లలైన్, సున్నంబట్టీ వీధి, జాలరు పేట, కేతావారి వీధి, మార్కెట్ ఏరియా, కొత్తపేట, ఎన్‌కే కాలనీ, రాజీవ్ నగర్, ఎర్రకొండ హైస్కూల్ ప్రాంతాల్లో రూ.20 లక్షల చొప్పున నిధులతో నిర్మించే డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా రాజబాబు, తలారి వరప్రసాద్, గోలి దేవకుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, పందెళ్ల భానుప్రసాద్, పేర్ల బాసి, ఎన్వీ శేఖర్, కొత్తపల్లి శివ, చాటకాల చంటి, మెండా రాజేష్, రేగుళ్ల రాజు, మిరప రమేష్, నంబూరి రవి, గూటం రాజు, దేవులపల్లి సరితారాణి, చప్పిడి జ్యోతి, పసుపులేటి దేవి, పట్టపగలు వెంకటలక్ష్మి, కల్యాణి రెడ్డి, ధర్మ, బాబీ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక శ్రీనివాస నగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం మిల్లెట్ ఆహార పదార్థాల స్నాక్ బ్రాండ్ ట్రూ గుడ్ లోగో పోటీ విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ హాజరయ్యారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, ఎంజేపీఏపీ బీసీ రెసిడెన్షియల్స్ స్కూల్స్ సహకారంతో ట్రూగుడ్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ట్రూగుడ్ లోగో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రథమ బహుమతిగా పి.మధుతేజశ్రీ (విశాఖపట్నం జిల్లా తానా గ్రామం)కి ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతిగా ఎస్.కృష్ణవేణి (కృష్ణాజిల్లా మచిలీపట్నం)కి ట్యాబ్, తృతీయ బహుమతిగా డి.నవదీప్ (సత్యసాయి జిల్లా పేరూరు)కు ట్యాబ్ అందజేశారు.

వేతనాల పెంపుపై హర్షం

కంబాలచెరువు: పాఠశాల విద్యాశాఖ, రాష్ట్ర సమగ్ర శిక్షలో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లకు, వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు 23 శాతం వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించడంపై పీఈటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ఎన్ దేవేంద్ర మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో గత నెల 10 తేదీన జరిగిన చర్చలలో భాగంగా ఈ వేతన పెంపుదల జరిగిందన్నారు. దీనితో పాటు పార్ట్ టైం అనే పదాన్ని తీసి ఒకేషనల్ టీచర్‌గా మార్చాలని మంత్రిని అడిగామని, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.10 లక్షలు ఇవ్వాలని కోరామన్నారు. అలాగే రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. ఈ అంశాలన్నీ పునఃపరిశీలించి సాధ్యమైనంత త్వరలో నెరవేరుస్తారని ఆశిస్తున్నామన్నారు.

శాస్త్రోక్తంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి

కడియం: దుళ్లలోని శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. లోక కళ్యాణార్థం స్వామివారి కల్యాణం జరిపించడంతో పాటు, భీష్మచరిత్ర తదితర ఆధ్యాత్మిక విషయాలను భక్తులకు వివరించారు. ప్రసాదంగా తలంబ్రాలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజామున స్వామివారి సుప్రభాత సేవ జరిగింది. సాయంత్రం సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం జరిగింది. గోవింద మాలధారులు, ఆలయ భక్త బృందం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. దుళ్లతో పాటు మురమండ, వీరవరం, మడికి, నర్సిపూడి, చొప్పెల్ల తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. కాగా.. స్వామివారిని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు దర్శించుకుని పూజలు నిర్వహించారు. బుధవారం సుదర్శన హోమం, సింహవాహన సేవ నిర్వహిస్తారు.

515 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి సచివాలయం -2లో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరంలో 515 మందికి వైద్యసేవలు అందించారు. డాక్టర్లు జి.రోహిత, ఆర్.వినయ్, కె.వరప్రసాద్, డి.సాంబయ్య వైద్యసేవలు అందించారు. పంచాయతీ కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, పడాల వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యానికి చక్కటి వేదిక

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం సర్కిల్ 9వ ఇంటర్ డివిజన్ స్పోర్ట్స్ గేమ్స్ విద్యుత్ సంస్థ ఉద్యోగుల క్రీడా నైపుణ్యానికి చక్కటి వేదిక అని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఐ.పృథ్వీతేజ్ అన్నారు. గోదావరి గట్టున గల శ్రీ త్యాగరాజ గాన సేవాసమితి హాల్లో మంగళవారం జరిగిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంటర్ డివిజన్ స్పోర్ట్స్ విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు శివకు అభినందనలు



శివకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

ప్రకాశం నగర్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ద్వారా గుర్తింపు లభించి, మరింత తర్ఫీదు కోసం క్రికెట్ అకాడమీకి ఎంపికైన చల్లారపు శివను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అభినందించారు. ఆమెను మంగళవారం ఉదయం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, శివ మర్యాదపూర్వకంగా కలిశారు. అండర్ 21 కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అకాడమికి శివను శిక్షణ కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ తరపున శివకు కలెక్టర్ క్రికెట్ కిట్ అందజేశారు. బాస్కెట్ బాల్ కోచ్ ఎన్.మోహన్ దాస్, యోగా కోచ్ బీవీజీ నాగేంద్రన్ పాల్గొన్నారు.

గోవింద క్షేత్రంలో విష్ణు పారాయణ



అఖండ విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు

ప్రకాశం నగర్: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం లాలాచెరువులోని గోవింద క్షేత్రంలో అఖండ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం అఖండ దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీమన్నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

376 మందికి వైద్య పరీక్షలు



కడియంలో మందులు పంపిణీ చేస్తున్న గిరజాల వీర్రాజు

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా కడియం సచివాలయం – 1 పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరంలో 376 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించడమే సీఎం జగన్ సంకల్పమన్నారు. ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న, సిబ్బంది వైద్య సేవలు అందించారు. అగర్వాల్ ఆసుపత్రి సిబ్బంది 38 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎస్.నాగసాయిమౌర్య, ఎం.ప్రశాంత్ కుమార్, ఎల్.మోహన వంశీ, స్థానిక నాయకులు దొడ్డా బుజ్జి, ఆర్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.